RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -242 పేజీలు - 08 వెల - 04/- శుక్రవారం 4 జులై 2025

# ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, హెల్త్ సెంటర్ల అనుసంధానం

## కుప్పంలో టాటా డిజిటల్ నెర్వ్ సెంటరును ప్రారంభించిన సీఎం చంద్రబాబు

- టాటా సంస్థ సహకారంతో రాష్ట్రంలోనే తొలి నెర్వ్ సెంటర్ ఏర్పాటు
- ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్, నిరంతర పర్యవేక్షణ
- ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, హెల్త్ సెంటర్ల అనుసంధానం
- వర్చువల్ విధానంలోనూ వైద్య నిపుణుల సలహాలు, సూచనలు
- దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా సేవలు విస్తరించాలని ప్రభుత్వ ప్రణాళిక



**కుప్పంజులై 3 ఆంధ్ర ప్రగతి:** ఏపీలో ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి డిజిటల్ నెర్వ్ సెంటర్ ను ప్రారంభించారు. ప్రముఖ సంస్థ టాటా సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం, ప్రజల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ రూపంలో భద్రపరిచి, వైద్య సేవలను మరింత సులభతరం చేయనుంది. ఈ డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా కుప్పం ఏరియా ఆస్పత్రితో మిగతాది 2లో...

### ప్రధాని మోడీకి ఘనా అత్యున్నత

# పురస్కారం

- రాబోయే ఐదేళ్లలో భారత్-ఘనాల మధ్య రెట్టిపు వాణిజ్యం
- ఘనంగా స్వాగతించిన ఘనా అధ్యక్షుడు...పార్లమెంటులో ప్రసంగం
- భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు ఉన్నట్లు ప్రకటన
- ఆశ్చర్య పోయిన పార్లమెంట్ సభ్యులు

**న్యూఢిల్లీ,జులై 3 ఆంధ్ర ప్రగతి:** భరాత ప్రధానికి ఘనమైన స్వాగతం, సత్కారం లభించాయి. ఘనా అత్యున్నత పురస్కారం కూడా ప్రదానం చేసింది. రాబోయే ఐదేళ్లలో భారత్- ఘనా దేశాలు వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఘనాకు భారతదేశం కేవలం భాగస్వామి మాత్రమే కాదని.. ఇరుదేశాలు కలిసి జోడీగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. భారత కంపెనీలు ఘనాలో దాదాపు 900 ప్రాజెక్టులలో రెండు బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాయని మోదీ చెప్పుకొచ్చారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా పశ్చిమ ఆఫ్రికాలోని ఘనా దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఘనాలో ప్రధాని మోదీకి ఆ దేశ ప్రతినిధులు, ప్రజల నుంచి సాదర స్వాగతం లభిస్తోంది. ప్రధాని మోదీ, ఘనా అధ్యక్షుడు జాన్ డ్రామానీ మహామాతో పలు భాగస్వామ్య అంశాలపై చర్చించారు. ఇండియా.. ఘనాతో యూపీఐ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉందని మోదీ చెప్పారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువని.. మిగతాది 2లో...



# దశాబ్దాలుగా రాయచోటిలో మకాం..




- రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులను అరెస్ట్ చేసిన పోలీసులు
- పేలుళ్ల కుట్రలకు ఉపయోగించే ఇఐడి స్వాధీనం
- ఉగ్రవాదులకు సహకరించిన వారిపై ఆరా
- -కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడి

**అన్నమయ్యజులై 3 ఆంధ్ర ప్రగతి:** జిల్లా కేంద్రమైన రాయచోటిలో దశాబ్దాలుగా సాధారణ జీవితం గడుపుతున్న ఇద్దరు వ్యక్తుల ముసుగు తొలగడంతో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'అల్ ఉమ్మా' ఉగ్రవాద సంస్థకు చెందిన ఈ ఉగ్రవాదుల నివాసాల్లో పోలీసులు జరిపిన సోదాల్లో భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, ఏకంగా 20 కిలోల బరువున్న సూట్‌కేస్ బాంబు లభ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. దేశంలోని మూడు మహానగరాలపై దాడి చేసేందుకు వీరు ప్రణాళికలు రచించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మిగతా 2లో...

# తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త న్యాయమూర్తులు

- సుప్రీంకోర్టు కొలీజయం నుంచి కీలక సిఫారసులు
- ఏపీ హైకోర్టుకు తుహిన్ కుమార్ పేరు ప్రతిపాదన
- తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీల పేర్లు ఖరారు
- జూన్ 2న సమావేశంలో కొలీజయం నిర్ణయం




**న్యూఢిల్లీ,జులై 3 ఆంధ్ర ప్రగతి:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులలో కొత్త న్యాయమూర్తుల నియామకానికి మార్గం సుగమమైంది. ఇరు రాష్ట్రాల హైకోర్టులకు కలిపి మొత్తం ఐదుగురు కొత్త జడ్జీల పేర్లను సుప్రీంకోర్టు కొలీజయం సిఫారసు చేసింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజయం కీలక నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే, తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త న్యాయమూర్తుల పేర్లను కొలీజయం ప్రతిపాదించింది. వీరిలో సుద్దాల చలపతిరావు, గాడి ప్రవీణ్ కుమార్, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహిద్దీన్ ఉన్నారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ పేరును సిఫారసు చేయడం జరిగింది. జూన్ 2వ తేదీన జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు కొలీజయం ఈ ఐదుగురి పేర్లను ఖరారు చేసి, వారి నియామకం కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసులను పంపింది. కేంద్రం ఆమోదం తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వులతో వీరి నియామకాలు అధికారికంగా ఖరారు కానున్నాయి.

# ఫ్యూచర్ సిటీ దేశానికి ఫ్యూచర్

## మలబార్ గోల్డ్ తయారీ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్




2లో

## అనారోగ్యంతో బాధపడుతున్న కెసిఆర్

- చికిత్స కోసం యశోదాలో చేరిక




2లో

## "నేను తప్పు చేయలేదు".. సిట్ కస్టడీకి వెళ్తూ జైలు వద్ద చెవిరెడ్డి కేకలు

- లిక్కర్ కేసులో మూడో రోజు సిట్ కస్టడీకి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి
- జైలు నుంచి తరలిస్తుండగా "నేను తప్పు చేయలేదు" అంటూ కేకలు
- తనపై అక్రమంగా కేసులు బనాయించారని ఆరోపణ



2లో

# ఇవిఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయి

- 2024 ఎన్నికలపై అనుమానాలు నివృత్తి చేయండి
- వచ్చే ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించండి
- ఇసిని కలిసి అనుమానాలు వెల్లడించిన వైకాపా నేతలు




6లో

## జగన్‌ను కలిసిన వల్లభనేని వంశీ

- కష్టకాలంలో అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు
- వంశీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగన్
- దాదాపు 140 రోజుల పాటు జైల్లో ఉన్న వంశీ



2లో

# ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, హెల్త్ సెంటర్ల అనుసంధానం




(మొదటి పేజీ తరువాయి)
పాటు 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), 92 గ్రామ ఆరోగ్య కేంద్రాలను అనుసంధానించారు. దీనివల్ల ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో భద్రపరచడమే కాకుండా వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు వీలు కలుగుతుంది. సకాలంలో వ్యాధి నిర్ధారణ, స్పెషలిస్ట్ వైద్యుల అపాయింట్‌మెంట్‌లు, వ్యక్తిగత కౌన్సెలింగ్ వంటి సేవలను ఈ కేంద్రం అందిస్తుంది. అలాగే అవసరమైన సందర్భాల్లో రోగులకు వర్చువల్ విధానంలోనే వైద్య నిపుణులతో మాట్లాడించి చికిత్స అందించే సౌకర్యం కూడా ఉంది. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం సేవలను, ప్రైవేటు ఆస్పత్రులను కూడా ఈ నెర్వ్ సెంటర్ ద్వారా అనుసంధానించుకునే అవకాశం కల్పించారు. స్క్రీనింగ్ టెస్టుల నుంచి చికిత్స అనంతర ఫాలో-అప్‌ల వరకు అన్ని సేవలు ఒకేచోట లభిస్తాయి. ప్రస్తుతం మొదటి దశలో కుప్పంలో ప్రారంభమైన ఈ సేవలను, రెండో దశలో చిత్తూరు జిల్లా అంతటికీ, మూడో దశలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ కార్యక్రమంతో ప్రజారోగ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

# ఫ్యూచర్ సిటీ దేశానికి ఫ్యూచర్

(మొదటి పేజీ తరువాయి)
నమ్మకం ఉంచి యూనిట్ ఏర్పాటు చేసిన మలబార్ గ్రూప్‌నకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ, తమిళనాడు, కేరళ పోటీపడుతున్నాయని చెప్పారు. మహేశ్వరంలో ఇండస్ట్రియల్ పార్కు, 'మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ' తయారీ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిం చారు. 'పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందుంది. హైదరాబాద్‌కు దేశంలో మరే నగరంతోనూ పోటీ లేదు.. ప్రపంచ నగరాలతోనే పోటీ. రానున్న వందేళ్లను దృష్టిలో పెట్టుకుని విజన్-2047 ప్రణాళికను రూపొందించుకున్నాం. నగర అభివృద్ధి కోసం దేశ, విదేశాలకు చెందిన కన్‌స్టలెంట్స్ పనిచేస్తున్నాయి. పెట్టుబడిదారులకు రక్షణ కల్పించి వారి వ్యాపారం లాభాల్లో సాగేలా సహకరిస్తున్నాంఅని సీఎం తెలిపారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడు తూ తెలంగాణలో తయారీ రంగం అభివృద్ధి ఎక్కువగా ఉందని.. 9 శాతానికి పైగా వృద్ధి సాధిస్తోందని చెప్పారు. గ్రీన్ ఇండస్ట్రియల్, నూతన ఎంఎస్‌ఎంఈ పాలసీ-2025ను ప్రభుత్వం ఆమోదించిం దని తెలిపారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు 4,200 దరఖాస్తులు వచ్చాయన్నారు. 15 రోజుల్లోనే 98 శాతం దరఖాస్తు లను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సింగిల్ విండో విధానంలో పారదర్శకంగా, వేగంగా అనుమతులు ఇస్తున్నామన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న కెసిఆర్

**● చికిత్స కోసం యశోదాలో చేరిక**

**హైదరాబాద్‌జులై 3 ఆంధ్ర ప్రగతి:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో గురువారం ఆయన సోమాజిగూడలోని యశోదా ఆసుపత్రిలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా కెసిఆర్ సీజనల్ జ్వరంతో బాధపడుతున్నట్లు సమాచారం. అయితే గురువారం ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి నగరంలో నందినగర్‌లోని తన నివాసానికి కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. గత వారం రోజులుగా జలుబు, దగ్గు, తలనొప్పితోపాటు జర్వం ఆయన్ని ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తుంది. జూన్ 11వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ ఎదుట కేసీఆర్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సైతం ఆయన కొంత అస్వస్థతతో ఉన్నారు. ఆ సమయంలో కమిషన్ ఎదుట విచారణ నేపథ్యంలో ఒపెన్ కోర్టుకు తాను రాలేనని.. ఇన్‌సైడ్ విచారణకు హాజరవుతానంటూ కమిషన్ కు ఆయన స్పష్టం చేశారు. అందుకు కమిషన్ సానుకూలంగా స్పందించింది. దీంతో ఇన్ సైడ్ విచారణకు కేసీఆర్ హాజరైన సంగతి తెలిసిందే. ఆయనకు జ్వరం తీవ్రం కావడంతో ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. కెసిఆర్ వెంట భార్య శోభారాణి, కెటిఆర్,హరీష్ రావు, మాజీ ఎంపి సంతోష్ కుమార్ ఉన్నారు.

# జగన్‌ను కలిసిన వల్లభనేని వంశీ

**కష్టకాలంలో అండగా నిలిచినందుకు అధినేతకు కృతజ్ఞతలు**

**వంశీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగన్**

**దాదాపు 140 రోజుల పాటు జైల్లో ఉన్న వంశీ**



గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ ఈ రోజు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. సుమారు 140 రోజుల పాటు జైలు జీవితం గడిపి బుధవారం విడుదలైన ఆయన, మరుసటి రోజే జగన్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన సతీమణి పంకజశ్రీతో కలిసి జగన్ నివాసానికి వెళ్లిన వంశీ, కష్టకాలంలో తనకు, తన కుటుంబానికి అండగా నిలిచినందుకు అధినేతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్.. వంశీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. జైలులో ఉన్న సమయంలో వంశీ అనారోగ్యానికి గురైనట్లు సమాచారం. కాగా, కూటమి ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసీపీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే వంశీపై మొత్తం 11 కేసులు నమోదు చేసి వేధించారని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ కేసుల కారణంగానే ఆయన సుమారు నాలుగున్నర నెలల పాటు విజయవాడ జైలులో ఉండాల్సి వచ్చిందని వారు దుయ్యబడుతున్నారు. వంశీకి న్యాయస్థానంలో బెయిల్ లభించినా, దానిని రద్దు చేయాలని ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, సర్వోన్నత న్యాయస్థానంలో ఊరట లభించడంతో ఆయన బుధవారం జైలు నుంచి విడుదలయ్యారు.

# ప్రధాని మోడీకి ఘనా అత్యున్నత పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)
ఇరు దేశాలు స్పష్టం చేశాయని, ఉగ్ర ముప్పును ఎదుర్కోవడంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించి నట్లు మోదీ వెల్లడించారు. రక్షణ, భద్రతా రంగంలో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతాయని మోదీ చెప్పారు. సాయుధ దళాల శిక్షణ, సముద్ర భద్రత, రక్షణ సామాగ్రి సరఫరా, సైబర్ భద్రత తదితర రంగాల్లో భారత్-ఘనా దేశాల మధ్య పరస్పర సహకారం పెరుగనున్నదని ప్రధాని మోదీ తెలిపారు. అటు, సంస్కృతి, సాంప్రదాయ వైద్యం తోపాటు పలు రంగాల్లో సహకారాన్ని అందించే నాలుగు ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకం చేశాయి. అనంతరం ఘనా పార్లమెంటును సందర్శించి సభ్యులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ గౌరవనీయమైన సభలో ప్రసంగించడం తనకు చాలా గౌరవంగా ఉందన్న మోదీ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రతినిధిగా, 1.4 బిలియన్ల భారతీయుల సద్భావన, శుభాకాంక్షలను తీసుకువచ్చానని అన్నారు. బుధవారం సాయంత్రం తన ప్రియ స్నేహితుడు, అధ్యక్షుడు జాన్ మహామా నుంచి ఘనా జాతీయ అవార్డును స్వీకరించడం హృదయపూర్వక అనుభవమని మోదీ సభకు చెప్పారు. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లని చెప్పిన మోదీ.. మనకు, ప్రజాస్వామ్యం కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదన్నారు. ఇది మన ప్రాథమిక విలువలలో ఒక భాగమని చెప్పుకొచ్చారు. భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు, వివిధ రాష్ట్రాలను పరిపాలించే 20 వేర్వేరు పార్టీలు, 22 అధికారిక భాషలు, వేలాది మాండలికాలు ఉన్నాయని మోదీ చెప్పారు. భారతదేశానికి వచ్చిన ప్రజలను ఎల్లప్పుడూ హృదయపూర్వకంగా స్వాగతించడానికి ఇదే కారణమని ప్రధాని అన్నారు.'ఇవాళ మన దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు, ఘనా బిడ్డ డాక్టర్ క్వామే న్క్రుమాకు నివాళులర్పించే గౌరవం నాకు లభించిందని' అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశిష్ట రాజనీతి, ప్రభావవంతమైన ప్రపంచ నాయకత్వానికి గుర్తింపుగా ఆ దేశ అధ్యక్షుడు జాన్ డ్రామణి మహామా చేతుల మీదుగా ఘనా జాతీయ గౌరవం 'ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' పురస్కారాన్ని అందుకున్నారు. 1.4 బిలియన్ల భారతీయుల తరపున ఈ అవార్డును స్వీకరిస్తున్నానని చెప్పిన మోదీ.. ఈ గౌరవాన్ని భారతదేశ యువత ఆకాంక్షలు, సాంస్కృతిక, సంప్రదా యాలు, వైవిధ్యం, ఇంకా ఘనా - భారత్ మధ్య చారిత్రక సంబంధాలకు అంకితం చేశారు. ఈ గౌరవాన్ని అందించినందుకు ఘనా ప్రజలకు, ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేశంలో పర్యటించడం తనకు లభించిన గౌరవమని హర్షం వ్యక్తంచేశారు. ఘనా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతోందని కొనియాడారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఏర్పడిన ప్రపంచక్రమం వేగంగా మారుతోంది. సాంకేతికతలో విప్లవం, గ్లోబల్‌సౌత్‌లో ఎదుగుదల ఆ మార్పునకు దోహదం చేస్తున్నాయి. గ్లోబల్‌సౌత్ గళం వినిపించకుండా ఆ పురోగతి సాధ్యంకాదు అన్నారు. 2047నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని మా ప్రజలు సంకల్పంతో ఉన్నారు. బలమైన భారత్.. సుస్థిరమైన ప్రపంచానికి దోహదం చేస్తుంది. ఆఫ్రికా అభివృద్ధి దిశగా చేసే ప్రయాణంలో మా సహాయాన్ని అందిస్తాం. మన దేశాల పురోగతికి పరస్పరం సహకరించు కుందామని మోదీ పిలుపునిచ్చారు. జీ20కి భారత్ సారథ్యం వహిస్తోన్న తరుణంలోనే ఆ గ్రూప్‌లో ఆఫ్రికా యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందకరమని వ్యాఖ్యానించారు. ఈ పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య పరిశోధన, అభివృద్ధి, ఔషధ తదితర రంగాలకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఒకరు ఘనాను సందర్శించడం ఇదే ప్రథమం.

# దశాబ్దాలుగా రాయచోటిలో మకాం..

## రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులను అరెస్ట్ చేసిన పోలీసులు

(మొదటి పేజి తరువాయి)
కొద్ది రోజుల క్రితం తమిళనాడు పోలీసులు ఒక నాన్-బెయిలబుల్ వారెంట్‌పై అబూబకర్ సిద్ధిఖీ (అలియాస్ అమానుల్లా), మహమ్మద్ అలీ (అలియాస్ మన్సూర్) అనే ఇద్దరినీ రాయచోటిలో అరెస్ట్ చేసి చెన్నైకి తరలించారు. వీరి అరెస్ట్ అనంతరం ఏపీ పోలీసులు రంగంలోకి దిగి లోతుగా దర్యాప్తు చేపట్టారు. నిందితుల ఇళ్లలో సోదాలు చేయగా బాంబుల తయారీకి ఉపయోగించే వైర్లు, స్విచ్‌లు, కంటైనర్లు, ఇతర రసాయనాలు బయటపడ్డాయి. వీటితో పాటు ప్రధాన నగరాల మ్యాప్‌లు, రైల్వే ట్రాక్ రూట్లకు సంబంధించిన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు




మీడియాకు వెల్లడించారు. లభించిన సామాగ్రితో దాదాపు 30-40 చిన్న బాంబులు లేదా 10 భారీ బాంబులు తయారు చేయవచ్చని నిపుణులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. నిందితులిద్దరూ 1999 కోయంబత్తూరు, 2013 బెంగళూరు మల్లేశ్వరం బాంబు పేలుళ్ల కేసుల్లో ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు గుర్తించారు. సుమారు 20-30 ఏళ్లుగా వీరు రాయచోటిలో మారుపేర్లతో స్థిరపడి, స్థానికులకు ఎలాంటి అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డారు. పోలీసుల సోదాలను అడ్డుకున్నందుకు నిందితుల భార్యలను కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం చెన్నై జైలులో ఉన్న ప్రధాన నిందితులిద్దరినీ పీటీ వారెంట్‌పై త్వరలో రాయచోటికి తీసుకొచ్చి విచారించనున్నట్లు డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. ఈ విచారణ ద్వారా వీరికి స్థానికంగా ఎవరెవరు సహకరించారు, ఆర్థిక మూలాలు ఏమిటి, వీరి భవిష్యత్ ప్రణాళికలు ఏంటి అనే పూర్తి వివరాలు రాబడతామని పోలీసులు పేర్కొన్నారు.

# "నేను తప్పు చేయలేదు".. సిట్ కస్టడీకి వెళ్తూ జైలు వద్ద చెవిరెడ్డి కేకలు

**జులై 3 ఆంధ్ర ప్రగతి:**
లిక్కర్ కేసులో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని మూడో రోజు విచారణ నిమిత్తం సిట్ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. అయితే, జైలు నుంచి ఆయన్ను విచారణకు తరలిస్తున్న సమయంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. "నేను ఏ తప్పు చేయలేదు, నాపై తప్పుడు కేసులు పెట్టారు" అంటూ చెవిరెడ్డి గట్టిగా కేకలు వేయడం అక్కడ కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే, లిక్కర్ కేసుకు సంబంధించి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు వెంకటేష్ నాయుడిని కూడా సిట్ అధికారులు



గురువారం కస్టడీకి తీసుకుని ప్రశ్నించనున్నారు. ఈ క్రమంలో వారిని జైలు నుంచి బయటకు తీసుకువస్తుండగా, చెవిరెడ్డి ఒక్కసారిగా తాను నిర్దోషినంటూ నినాదాలు చేశారు. తనను ఈ కేసులో అన్యాయంగా ఇరికించారని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉండగా, గడిచిన రెండు రోజుల విచారణలో చెవిరెడ్డి నుంచి సిట్ అధికారులకు ఆశించిన స్థాయిలో సహకారం అందలేదని తెలుస్తోంది. అధికారులు అడిగిన ప్రశ్నలకు ఆయన దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మూడో రోజు విచారణ కీలకంగా మారింది. కేసులో కీలక సమాచారం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# ఉత్సాహంగా జనంలోకి..

## 'తొలి అడుగు'తో ముందుకెళుతున్న కూటమి

**రాష్ట్రవ్యాప్తంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం**

**ఇంటింటికీ వెళుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు**

**ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యల స్వీకరణ**

**'తల్లికి వందనం' వంటి పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన**

**ఏడాది పాలన విజయాలను ప్రజలకు చేరవేసే బృహత్తర ప్రయత్నం**



**జులై 3 ఆంధ్ర ప్రగతి:**
ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా, తెలుగుదేశం పార్టీ 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నిన్న ప్రారంభమైన ఈ కార్యక్రమం, రెండో రోజైన గురువారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రజలతో మమేకమవుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా, గత ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ముఖ్యంగా, పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థుల తల్లులకు అండగా నిలిచే 'తల్లికి వందనం' పథకం కింద ఏటా రూ.15,000 ఆర్థిక సాయం, లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ల పంపిణీ, అర్హులైన మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తున్నారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ, ప్రభుత్వ విజయాలను వివరిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, నేతలు కేవలం పథకాలను వివరించడమే కాకుండా, ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరిస్తున్నారు. పలుచోట్ల వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, అధికారులకు ఆదేశాలు జారీ చేసి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ఉదాహరణకు, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తాడేపల్లిలో స్వయంగా పర్యటించి, స్థానికుల నుంచి మౌలిక వసతులపై వచ్చిన వినతులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలనను ప్రజలకు అందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులని, వారికి పాలనలో భాగస్వామ్యం కల్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వారు వివరిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించడంతో పాటు, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు వాస్తవాలతో సమాధానం చెప్పాలని ఎన్డీయే కూటమి భావిస్తోంది.

# అధికారుల మాట తీరు మారాలి- వేధింపులు ఆపాలి.

## సి.ఓ లక్ష్మీ కుమారి పై చర్యలు తీసుకునేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 03:** సిఆర్పిలమంతా కలిసి ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తున్నామని ఏ ఒక్కరి పైన దాడి జరిగిందనో వేధింపులకు గురయ్యారని కాదు పోరాటం ఇలాంటి ఘటనలు మరొక్క సిఆర్పి పై జరగకూడదని ఐక్యంగా కలిసి పోరాటాన్ని కొనసాగిస్తున్నామని అందుకే సిఆర్పిలమంతా కలిసి పనులను నిలిపివేసి గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్డుపైకి వచ్చి పోరాటాన్ని చేస్తున్నామని ప్రజలు గమనించాలని మద్దతుగా నిలబడాలని,సిఆర్పి భవాని పైన దురుసుగా ప్రవర్తించి ఇబ్బందులకు గురిచేసిన, ఆర్ పి షేక్ రహమతు బీ ను 30 వేలు ఇవ్వాలని లేకుంటే విధులనుంచి తొలగిస్తానని బెదిరించిన సి.ఓ. లక్ష్మి కుమారి పై చర్యలు తీసుకోవాలని, సి అర్ పి ల పై పెరిగిన పని భారాన్ని తగ్గించాలని అదనపు పనులు చేయించరాదని అధికారుల,రాజకీయ వేధింపులను ఆపాలని కోరుతూ ఏ.పీ. మెప్మా ఆర్పి ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిరసన దీక్ష చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, యూనియన్ అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి హైమావతి లతోపాటు సిఆర్పీలు ప్రసన్న కుమారి, సులోచన, సత్యవతి, సువర్ణ, మాధవి, జ్యోతి, అరుణ,పుష్పలత, రహమత్ బి,భవాని, అనిత, మహేశ్వరి తో పాటు 100 మంది సిఆర్పిలు పాల్గొనడం జరిగింది.అనంతరం సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్ యూనియన్ అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి హైమావతి,యూనియన్ నాయకురాలు ప్రసన్నకుమారి లు మాట్లాడుతూ 15వ వార్డులో విధులు నిర్వహిస్తున్న ఆర్పి షేక్ రహమత్ బీ ని సి. ఓ.లక్ష్మి కుమారి 30వేల రూపాయలు ఇవ్వాలని ఇవ్వకుంటే సిఆర్పి గా నిన్ను తొలగిస్తానని, ఎంత పని చేసినా 0% చూపిస్తానని, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో, ఎవరు ఏమి చేయలేరు. నీ శాలరీ కూడా రాకుండా నేను ఆపుతాను అని సి.ఓ లక్ష్మీ కుమారి బెదిరించడం జరిగింది. ఆ తర్వాత ఈ విషయమై ఆర్పి లలో చర్చ జరుగుతుండగా 28వ వార్డులో విధులు నిర్వహిస్తున్న భవాని అందరికీ తెలియజేసిందని, మాట్లాడిందని ఆఫీసు దగ్గరికి వచ్చిన సందర్భంలో గొంతు పట్టుకుని మెడకు చున్నిని చుట్టి లాగి చెప్పలేని పదజాలంతో తిడుతూ వెంట్రుకలు పట్టుకుని చెంప మీద కొట్టడం జరిగింది. ఆ తర్వాత చేతివేలు ను విరవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది. ఈ ఘటనల వలన ఆర్పీలలో భయం నెలకొంది. కావున ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే వెంటనే సి.ఓ లక్ష్మీకుమారిపై చర్యలు తీసుకోవాలని వెంటనే సీఆర్పీలలో ఉన్న భయాన్ని పోగొట్టేలా చూడాలని కోరుతున్న గత 15 రోజుల నుండి సీఎం శోభ గారు పిడి ఎలాంటి చర్యలు తీసుకోవడానికి ముందుకు రావడం లేదని సోమవారం జరిగిన పి జి ఆర్ ఎస్ లో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని అంతకుముందే మున్సిపల్ చైర్ పర్సన్ మున్సిపల్ కమిషనర్ కి తెలిపిన ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదని రెండు రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని లేకుంటే విజయవాడలో మెప్మా ఎం.డి. ని కలిసి సమస్యను విన్నవించేందుకు వెళతామని అన్నారు. మెప్ప అర్పిల సమస్య పరిష్కారమయేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉంటామని తెలిపారు.

# వాలంటీర్ జాబ్ కల్పించి నిరుద్యోగులను వై ఎస్ జగన్ మోసం చేశారు.

## ఏడాది అయినా వైసీపీ ఆరాచకాలను ప్రజలు మరువలేదు.

## ఉమ్మడి ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. -నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.






**ఆంధ్ర ప్రగతి డోన్ జూలై 03:** ఏడాది గడచినా గత వైసీపీ ప్రభుత్వ ఆరాచకాలను రాష్ట్ర ప్రజలు మరచిపోలేదని, ఉన్నత చదువులు చదివిన యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించకుండా కేవలం గౌరవ వేతనంతో వాలంటీర్ జాబ్ కల్పించి నిరుద్యోగ యువతను వై ఎస్ జగన్ మోసం చేశారాని, ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అన్ని పథకాలు అందుతున్నాయని, ఉమ్మడి ఏడాది పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.గురువారం నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డితో కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సుపరిపాలనలో - తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం పథకాలు అందుతున్న విధానం వివరించారు.

ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ జగన్ పాలనపై ప్రజలు విసుగుచేంది వైసీపీకీ కనీసం ప్రతిపక్ష హెూదా కూడా ఇవ్వలేదని, మళ్ళీ ఏ మోహం పెట్టుకొని పాదయాత్రతో ప్రజల ముందుకు వస్తామని వైసీపీ నేతలు చెబుతున్నారని ఆమె ప్రశ్నించారు. డిగ్రీ, పీజీ చేసిన అర్హత గల యువతకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించకుండా రూ. 5 వేల గౌరవవేతనంతో వాలంటీర్ జాబ్ కల్పించి నిరుద్యోగులను వై ఎస్ జగన్ మోసం చేశారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విమర్శించారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఏడాది ఉమ్మడి పాలనలో ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఆంధ్రప్రదేశ్ కు వచ్చి పరిశ్రమలు స్థాపిస్తున్నాయని, లూలు, రిలయన్స్, ఎం జీ, తదితర కంపెనీలు పరిశ్రమలు నెలకొల్పడం వల్ల ఇప్పటికే 9 లక్షల ఉద్యోగాలు వచ్చాయని, మరో నాలుగేళ్లలో 40 లక్షల ఉద్యోగాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ లు ముందుకు సాగుతున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయి కాబట్టే ఉమ్మడి ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారన్నారు. ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే తెలుసుకొని వాటి పరిస్కారం కోసం ఇంటింటికి సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వెళుతున్నామన్నారు. వైసీపీ తాటాకు చెప్పుళ్లకు టీడీపీ కార్యకర్తలు భయపడరని, ఏ మోహం పెట్టుకొని వైసీపీ నాయకులు పాదయాత్రతో ప్రజల వద్దకు వస్తారని ఆమె నిలదీశారు. వైసీపీ పాలనలో ఇంట్లో ఒకరికే అమ్మవడి ఇస్తే సీఎం చంద్రబాబు ఇంట్లో చదువుకుఅంటున్న వారందరికీ తల్లికి వందనం అందించారని, ఇదేళ్ళ వైసీపీ పాలనలో కేవలం రూ. 250 లు పెన్షన్ పెంచితే సీఎం చంద్రబాబు ఏకంగా రెండు వేల పెన్షన్ రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు, వైద్యం అంధుకున్న దీర్ఘకాళిక రోగులకు రూ. 10 వేల పెన్షన్ పెంచి ప్రతి నెల ఒకటవ తేదీననే ఇంటికి వచ్చి అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, ఉమ్మడి కర్నూలు జిల్లా మార్కెటింగ్ సోసైటీ లిమిటెడ్ జిల్లా చైర్మన్ వై నాగేశ్వరావుయాదవ్ డోన్ నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి సుపరిపాలనలో - తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దేశంలోను,రాష్ట్రంలో అన్ని రోడ్ల ఇరుపక్కల మొక్కలు నాటించే ఏర్పాటు చేయాలి.

## చెట్లు లేకపోతే మనిషి భూమిపై జీవించలేడు. -సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ జులై 03:** మనిషికి ప్రాణవాయువు అయిన ఆక్సిజన్ విడుదల చేస్తూ ఆరోగ్యాన్ని అందించడంలో చెట్లు కీలకమైనవి. కాబట్టి చెట్టు లేకపోతే మనిషి భూమిపై జీవించలేడు. చెట్లు అవస్యకత గురించి ప్రజల్లో విశృత అవగాహన కల్పించి మొక్కలు నాటి వాతావరణ కాలుష్యాన్ని నివారించే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని,అలాగే మహవృక్షాలను కాపాడుకోవలసిన భాద్యత ప్రతి ఒక్కరిదని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి పేర్కొన్నారు. భూమి బ్రతకాలంటే లక్షన్నర కోట్ల మొక్కలు నాటి మహా వృక్షాలుగా చేయాలని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో మన దేశంలోను, రాష్ట్రంలోను, జిల్లాల్లోను,మండలాల్లోను, గ్రామాల్లోను చెట్లు లేకపోతే భూమి పై కాలుష్యం పెను ప్రమాదంగా మారుతుందని గాలిలో కార్బన్డయాక్సైడ్ పెరుగుతూ ప్రజల ఆరోగ్యాలకు హనికరమని నిపుణులు తెలియజేస్తున్నారని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. కావున దేశంలో అన్ని మెయిన్ రోడ్లు నందు అవకాశం ఉన్నచోట్ల రోడ్డు ఇరుపక్కల చెట్లను నాటే ఏర్పాటు చెయ్యాలని అన్ని వీధులలో ఇంటి దగ్గర చెట్టు వేసుకునే అవకాశం ఉన్న ప్రతి ఒక్కరికి ఒక మొక్క ఇచ్చి చెట్లను పెంచే విధంగా



పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త ,డోన్

అవగాహన కల్పించి వాతావరణ కాలుష్యాన్ని నివారించె విధంగా చేయించాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి వేడుకుంటున్నాను.మన దేశంలో అనేక నగరాలు కాలుష్య కోరలో చిక్కుకున్నాయి. ఇప్పటికే శాస్త్రవేత్తలు గ్లోబల్ వార్నింగ్ ఇస్తున్నారు.చెట్లు లేకపోతే మానవ మనగడకు ప్రమాదమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. చెట్లు లేకపోతే మనిషి జీవించలేడు అంతేకాకుండా మహా వృక్షాలు ప్రకృతి పర్యావరణ సమతను కాపాడుతాయి. ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయి అంటే భూమిపై ఉన్న చెట్లు తొలగించి అడవులను నాశనం చేయడమే ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. కావున మనదేశంలోని ప్రజల భాగస్వామ్యంతో చెట్లు నాటే కార్యక్రమం చేయించాలి.చెట్ల యొక్క ఆవశ్యకతను వాతావరణ కాలుష్యం గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి లక్షన్నర కోట్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చెయ్యాలని వేడుకుంటున్నాను. అలాగే నిప్పుల కొలిమిగా మారుతున్న ఈ భూమిని కొన్ని సందర్భాల్లో అభివృద్ధి పేరుతో పర్యావరణానికి హాని కలిగిస్తు న్నారని కలిగించకుండా చూడాలని వేడుకుంటున్నాను. కావున మనిషికి ప్రాణవాయువైన ఆక్సిజన్ విడుదల చేస్తూ ఆరోగ్యాన్ని అందిస్తున్నటువంటి చెట్లు కీలకమైనవి. కాబట్టి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యంతో చెట్లు పెంచె ప్రణాళికను ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి వేడుకుంటున్నాను.


# బొమ్మల సత్రం ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతాం - ఎన్ఎండి ఫిరోజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 03:** నంద్యాల పట్టణంలోని 32వ వార్డు బొమ్మలసత్రం ఫ్లైఓవర్ క్రింద కొద్దిపాటి వర్షానికే మురికినీరు రోడ్ల పై ప్రవహిస్తూ ఇళ్లలోకి చేరిపోతుండటంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని 32 వ వార్డు ఇంచార్జ్ కొండా శ్రీనివాసులు యాదవ్ గారు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కు విషయాన్ని తెలియజేయగా వెంటనే స్పందించిన ఎన్ఎండి ఫిరోజ్ స్వయంగా పరిశీలించి అక్కడికక్కడే ఆర్ %డ% బీ మరియు మున్సిపల్ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువచ్చి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ గత పాలకుల 20 ఏళ్ళ నిర్లక్ష్య పాలన వల్ల బొమ్మలసత్రం ప్రాంతం చాలా వెనుకబడిపోయిందన్నారు. సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడంతో మురికి కుంపటిలా మారిపోయిందన్నారు. బొమ్మల సత్రం డ్రైనేజీ వ్యవస్థకు నిర్మాణాలు మరియు మరమ్మత్తులు చేపట్టకుండా 20 ఏళ్ళ క్రితం ఉన్న డ్రైనేజీ వ్యవస్థ తోనే కాలం వెళ్లదీశారన్నారు. బొమ్మలసత్రంలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు మురికి కాలువలు లేక, డ్రైనేజీ కల్వర్టులు లేక కొద్దిపాటి వర్షానికి మురికి నీరు ఇళ్లల్లోకి చేరిపోతుందని స్థానిక ప్రజల ఇబ్బందులను తెలుసుకొని ఈరోజు పరిశీలించి తక్షణమే సంబంధిత అధికారులు దృష్టికి సమస్యను తీసుకురావడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు నంద్యాల శాసనసభ్యులు ఎన్ఎండి ఫరూక్ నాయకత్వంలో బొమ్మల సత్రం ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతామని ఈ సందర్భంగా ఫిరోజ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌బీకే లో 'అన్నదాత సుఖీభవ' డేటా నమోదును ఆకస్మికంగా తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్.



**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల/నంద్యాల జూలై 03:** నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం, సిరివెళ్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) లో అన్నదాత సుఖీభవ పథకం కింద జరుగుతున్న డేటా ఎంట్రీ పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ సి. విష్ణు చరణ్ గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆర్‌బీకే కేంద్రంలో జరుగు కార్యకలాపాలను, డేటా నమోదు ప్రక్రియను, రైతుల ఆధార్, ఖాతా, భూమి సంబంధిత వివరాల నమోదులో పని నాణ్యతను జేసి సమీక్షించారు. డేటా ఎంట్రీలో జాగ్రత్తలు పాటించాలనీ, పొరపాట్లకు తావు లేకుండా పనిచేయాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, "అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలు రైతులకు నేరుగా లాభం చేకూర్చే విధంగా అమలవుతుండాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం ద్వారా మద్దతు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 6న తొలి ఏకాదశిని పురస్కరించుకొని గీతా ప్రచార ధామం నందు విశేష కార్యక్రమాలు.

## -గీతారత్న డి. వి. రమణ



**ఆంధ్ర ప్రగతి కర్నూలు జూలై 03:** ఈనెల 6న తొలి ఏకాదశిని పురస్కరించుకొని కర్నూలు పట్టణం ఎన్ ఆర్ పేటలో నెలకొన్న శ్రీ గీతా ప్రచార ధామం నందు విశేష కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు విద్యా ప్రకాశానంద స్వామి గీతా ప్రచార సంఘం అధ్యక్షులు, గీతారత్న పురస్కార గ్రహీత డి. వి. రమణ తెలిపారు. గీతా ప్రచార ధామం నందు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో ఏకాదశికి ఎంతో విశిష్టత ఉన్నదని అందునా తొలి ఏకాదశికి ఇంకా ఎంతో ప్రాధాన్యత ఉన్నదని దీనినే శయన ఏకాదశి అని కూడా పిలుస్తారని, ఇంతటి ప్రాశస్తం కలిగిన విష్ణు రోజుల్లో విష్ణు సంబంధమైన కథలు, పారాయణాలు, అభిషేకాలు, పూజాదికాలు విశేష పుణ్యఫలాన్ని కలిగిస్తాయని, అందుకే ఉదయం 9-00 గంటలకు సామూహిక గోపూజ, విష్ణు సహస్రనామ పారాయణం, సంపూర్ణ భగవద్గీత పారాయణం, ధార్మిక ప్రముఖులచే ప్రవచనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులందరు ఈ మహత్తరమైన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొనగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం సభ్యులు ఇల్లూరి రమణ, సింహాద్రి రమేశ్, వాసవీ జగన్నాథ గుప్తా, ప్రచార కార్యదర్శి మహాబలేశ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ గ్రహీత, మరియు శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం నిర్వాహకురాలు బి. నాగమల్లేశ్వరమ్మ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 6 మంది పేకాటరాయుళ్ల అరెస్టు..

## రూ.2,050 నగదు స్వాధీనం.



**ఆంధ్ర ప్రగతి మహానంది జులై 03:** పేకాట శిబిరంపై దాడి చేసి 6 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు మహానంది ఎస్ఐఎన్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. మహానంది మండలం అబ్బిపురం గ్రామంలో పేకాట (అందర్- బహార్) ఆడుతున్నారని సమాచారం రావడంతో, పేకాట శిబిరం పైదాడి చేసి 6 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద ఉన్న రూ. 2,050 నగదు స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు, యువత అసాంఘిక కార్యకలాపాలకు, చట్ట వ్యతిరేక పనులకు, వ్యసనాలకు పాల్పడవద్దని సూచించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# జీతాల్లో హైదరాబాద్‌దే అగ్రస్థానం...

## ఫ్రెషర్స్‌కు చెన్నై స్వర్గధామం!

**జులై 3 ఆంధ్ర ప్రగతి:** భారతదేశంలో ఉద్యోగ వేతనాల విషయంలో సరికొత్త ట్రెండ్ మొదలైంది. ఒకప్పుడు బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలు మాత్రమే అధిక జీతాలకు చిరునామాగా ఉండేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. ముఖ్యంగా దక్షిణాది నగరాలైన చెన్నై, హైదరాబాద్‌తో పాటు అహ్మదాబాద్ వంటి నగరాలు కొత్త శాలరీ హాట్‌స్పాట్లుగా ఎదుగుతున్నాయి. ప్రముఖ జాబ్ పోర్టల్ 'ఇండీడ్' విడుదల చేసిన 'పేమ్యాప్ సర్వే'లో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.



దేశవ్యాప్తంగా 1,311 యాజమాన్యాలు, 2,531 మంది ఉద్యోగుల నుంచి సేకరించిన అభిప్రాయాలతో ఈ నివేదికను రూపొందించారు. కరోనా అనంతర ఆర్థిక వ్యవస్థలో జీతాల ప్రమాణాలు, రంగాల వారీగా ధోరణులు, ఉద్యోగుల మనోభావాలను అర్థం చేసుకోవడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశం.

**ఫ్రెషర్లకు చెన్నై.. అనుభవజ్ఞులకు హైదరాబాద్!**

ఈ సర్వే ప్రకారం, ఉద్యోగ జీవితాన్ని ఇప్పుడే ప్రారంభిస్తున్న ఫ్రెషర్లకు (0-2 ఏళ్ల అనుభవం) చెన్నై నగరం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తోంది. ఇక్కడ అన్ని రంగాల్లో కలిపి ఫ్రెషర్లు నెలకు సగటున రూ. 30,100 జీతం అందుకుంటున్నారు. మరోవైపు, మధ్యస్థాయి, సీనియర్ స్థాయి (5-8 ఏళ్ల అనుభవం) ఉద్యోగులకు అత్యధిక వేతనాలు అందించడంలో హైదరాబాద్ నగరం అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ అనుభవజ్ఞులు నెలకు రూ. 69,700 వరకు సంపాదిస్తున్నారని నివేదిక స్పష్టం చేసింది. ఈ పరిణామం, కెరీర్‌లో ఉన్నత స్థాయికి వెళ్లాలనుకునే వారికి హైదరాబాద్ ఒక ఆకర్షణీయమైన కేంద్రంగా మారుతోందని సూచిస్తోంది.గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా ఉద్యోగుల జీతాలు సగటున 15 శాతం పెరిగినప్పటికీ, ఈ వృద్ధి సంప్రదాయ ఆర్థిక కేంద్రాలకే పరిమితం కాలేదని నివేదిక పేర్కొంది. "జీతాల విషయంలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఉద్యోగులు ఇప్పుడు జీవన వ్యయంతో పాటు కెరీర్ అవకాశాలకు అనుగుణంగా జీతాలు లభించే నగరాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మా డేటా ప్రకారం, అవకాశాలు ఇకపై కేవలం పెద్ద మెట్రో నగరాలకే పరిమితం కాలేదు, అవి ఇతర నగరాలకు కూడా విస్తరిస్తున్నాయి," అని ఇండీడ్ ఇండియా సేల్స్ హెడ్ శశి కుమార్ వివరించారు. సర్వేలో పాల్గొన్న వారిలో 69 శాతం మంది ఉద్యోగులు తాము నివసిస్తున్న నగరాల్లో జీవన వ్యయానికి తగినట్లుగా తమ ఆదాయం లేదని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఢిల్లీ (96%), ముంబై (95%), పుణె (94%), బెంగళూరు (93%) వంటి ఖరీదైన మెట్రో నగరాల్లో ఈ అసంతృప్తి అత్యధికంగా ఉంది. దీనికి విరుద్ధంగా చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్, కోల్‌కతా వంటి నగరాలు తక్కువ ఖర్చుతో కూడుకున్నవిగా ఉండటంతో, ఉద్యోగులకు ఆర్థికంగా కొంత వెసులుబాటు లభిస్తున్నట్లు తెలుస్తోంది.

రంగాల వారీగా చూస్తే, అన్ని స్థాయిల అనుభవజ్ఞులకు అధిక జీతాలు అందించడంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ/ఐటీఈఎస్) రంగం తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. డిజిటల్, ఏఐ ఆధారిత నైపుణ్యాలకు పెరుగుతున్న డిమాండే ఇందుకు ప్రధాన కారణం. ఈ

# త్వరలో కొత్త పెన్షన్లు

## మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి

నెల్లూరు,**జులై 3 ఆంధ్ర ప్రగతి:** రాజకీయాలు, కులమతాలకి అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం నెల్లూరు జిల్లాలోని చేజర్లలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి ఆనం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సూపర్ 6 హామీలను వరుసగా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇప్పటికే ఎన్టీఆర్ పెన్షన్లు, దీపం పథకం, తల్లికివందనం అమలు చేశామని వెల్లడించారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయబోతున్నామని

ప్రకటించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే ఆడబిడ్డ నిధి అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉద్ఘాటించారు. ఏపీలో త్వరలో 80వేల కొత్త పెన్షన్లు ఇవ్వబోతున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. చేజర్లలో రూ.1.20కోట్లతో గ్రామ కొలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం సంగం బ్యారేజీ పనులని కట్ అండ్ పేస్ట్ లా చేశారని విమర్శించారు. ఇప్పుడు రూ.73 కోట్లతో సంగం బ్యారేజిపై రోడ్ నిర్మాణం చేపట్టి ముంబై హైవేకి కనెక్ట్ చేయబోతున్నామని తెలిపారు. చేజర్లలో రూ.2కోట్లతో చెన్నకేశవ స్వామి ఆలయం పున:నిర్మాణం చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# చేపల వేటలో విషాదం

## యువకుడిని లాక్కెళ్లిన భారీ చేప

అనకాపల్లిగ**జులై 3 ఆంధ్ర ప్రగతి:** చేపల వేట విషాదం మిగిల్చింది. భారీ చేప ఒకటి యువకుడిని లాక్కెళ్లింది. దీంతో అతడి కోసం గాలించినా లాభం లేకుండా పోయింది. నసముద్రంలో చేపలవేటకు వెళ్లిన ఆ యువకుడు భారీ చేపను చేజిక్కించుకునే యత్నంలో ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన చోడపల్లి యర్రయ్య (26).. ఆయన తమ్ముడు కొర్లయ్య, వాసుపల్లి యల్లాజి, గనగళ్ల అప్పలరాజులు బుధవారం తెల్లవారుజామున సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. తీరానికి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో వేట సాగిస్తుండగా.. గేలానికి సుమారు 100 కిలోల బరువుండే కొమ్ముకోనాం చేప చిక్కింది. దాన్ని యర్రయ్య తాడుతో బోటులోకి లాగే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో చేప యర్రయ్యను బలంగా నీటి లోపలికి లాక్కెళ్లిపోయింది. కళ్లముందే యర్రయ్య గల్లంతు కావడంతో కన్నీటిపర్యంతమైన ఆయన సోదరుడు కొర్లయ్య గ్రామస్థులకు సమాచారం అందించారు. గ్రామస్థులు పడవల్లో సాయంత్రం వరకు గాలించినా యువకుడి ఆచూకీ తెలియరాలేదు. దీంతో పూడిమడక గ్రామంలో విషాదం నెలకొంది. తల్లి కోదండమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు.

# భారత రక్షణ రంగం బలోపేతం దిశగా కీలక ముందడుగు

## రూ. 1.05 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాల కొనుగోలుకు ఆమోదం

**జులై 3 ఆంధ్ర ప్రగతి:** భారత రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేసింది. సుమారు రూ. 1.05 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాలు, ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు రక్షణ మంత్రి రాజ్?నాథ్ సింగ్ అధ్యక్షతన ఉన్న రక్షణ కొనుగోళ్ల మండలి



(డీఏసీ) గురువారం ఆమోదం తెలిపింది. ఈ కొనుగోళ్లన్నీ పూర్తిగా దేశీయ కంపెనీల నుంచే చేపట్టనుండటం 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పెద్ద ఊతంగా నిలవనుంది.ఈ సమావేశంలో త్రివిధ దళాల అవసరాల కోసం క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలు (ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్), ఆర్మర్డ్ రికవరీ వాహనాలు, ఇంటిగ్రేటెడ్ కామన్ ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి 10 కీలక ప్రతిపాదనలకు 'అవసర ఆమోదం' లభించింది. వీటితో పాటు నౌకాదళం కోసం మైన్ కౌంటర్ మెజర్ వెస్సెల్స్, సూపర్ ర్యాపిడ్ గన్ మౌంట్ వంటి అత్యాధునిక పరికరాలను కూడా సేకరించనున్నారు. ఈ కొత్త ఆయుధాలు, వ్యవస్థల చేరికతో త్రివిధ దళాల కార్యాచరణ సామర్థ్యం మరింత పటిష్ఠం కానుందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.ఇటీవల కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సదస్సులో మాట్లాడిన రాజ్?నాథ్ సింగ్, దేశీయ రక్షణ ఉత్పత్తులు రికార్డు స్థాయికి చేరాయని తెలిపారు. "పదేళ్ల క్రితం కేవలం రూ. 43,000 కోట్లుగా ఉన్న మన రక్షణ ఉత్పత్తి, ఇప్పుడు రూ. 1.46 లక్షల కోట్లను దాటింది. అదే విధంగా, రూ. 600-700 కోట్లుగా ఉన్న మన రక్షణ ఎగుమతులు నేడు రూ. 24,000 కోట్ల రికార్డును అధిగమించాయి" అని ఆయన వివరించారు. దేశ భద్రతకు, శ్రేయస్సుకు 'మేక్ ఇన్ ఇండియా' విధానం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రయాణంలో 16,000కు పైగా ఎంఎస్ఎంఈలు భాగస్వాములై లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని మంత్రి తెలిపారు.

# ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర

## కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

శ్రీనగర్,**జులై 3 ఆంధ్ర ప్రగతి:**

కశ్మీర్ హిమాలయ పర్వతాల్లో మంచులింగం రూపంలో కొలువైన శివుడ్ని భక్తులు దర్శించుకునేందుకు కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. యాత్ర మారాల్లో గగనతలంపై నుంచి కూడా పర్యవేక్షణ సాగుతోంది. 38 రోజుల పాటు సాగే ఈ యాత్ర ఆగస్టు 9 నాటికి పూర్తవుతుంది.3880 మీటర్ల ఎత్తులో ఉండే గుహలో ఉన్న ఈ క్షేత్రానికి గురువారం మొదటి బ్యాచ్ భక్తులు బల్తాల్, నున్‌వాన్ శిబిరాల నుంచి బయలుదేరారు.అనంతనాగ్ లోని పహల్గాం లో నున్‌వాల్ శిబిరం నుంచి 48 కిమీ రూటు నుంచి, సెంట్రల్ కశ్మీర్ లోని గండెర్‌బాల్ సోనామార్గ్ ఏరియా14 కిమీ బల్తాల్ రూటు నుంచి గురువారం తెల్లవారు జామున బయలుదేరారు. యాత్రికులు 'భంభం బోలే.. హరహరమహాదేవ్' నినాదాలతో ముందుకు సాగారు. ముందుగా భరించలేని వాతావరణంలో కష్టతరమైన మార్గం ఉన్నా వారి ముఖాల్లో ఆనందం తొంగి చూసింది. యాత్రికులు తమకు కట్టుదిట్టమైన భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. యాత్రికులతోపాటు కేంద్ర మంత్రి శోభ కరండ్లజే కూడా బల్తాల్ రూటులో బయలుదేరారు. బుధవారం జమ్ము లోని భగవతి నగర్ శిబిరం నుంచి మొదటి బ్యాచ్ 5892 మంది యాత్రికులు బయలుదేరారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. యాత్రికులు మధ్యాహ్నం కశ్మీర్ లోయకు చేరుకోగానే అధికారవర్గాలు, స్థానికులనుంచి వారికి ఘనమైన స్వాగతం లభించింది. గత ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడిలో 22 మంది తుపాకీ కాల్పులకు బలైపోయిన దుర్ఘటన దృష్టా భక్తులకు ఎలాంటి భయాందోళనలు లేకుండా ఉండేందుకు గట్టిభద్రతా ఏర్పాట్లు జరిగాయి. పోలీస్, పారామిలిటరీ విభాగాల నుంచి వేలాది మంది భద్రత సిబ్బందిని నియమించారు.

## సూక్ష్మ, చిన్న వ్యాపారులకు రుణాలు మరింత సులువు

# ముందస్తు చెల్లింపు జరిమానాలకు ఆర్‌బిఐ బ్రేక్

ముంబై,**జులై 3 ఆంధ్ర ప్రగతి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూక్ష్మ, చిన్న వ్యాపారులకు రుణాలు అందుబాటులో ఉండేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో జనవరి 1, 2026 నుంచి కొత్తగా ఇచ్చే లేదా పునరుద్ధరించే ఫ్లోటింగ్ రేట్ రుణాలపై బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు ముందస్తు చెల్లింపు జరిమానాలు విధించకూడదని ఆర్‌బీఐ తెలిపింది. ఈ నిర్ణయం ఎంఎస్ఇలకు ఆర్థిక సౌలభ్యాన్ని, స్వేచ్ఛను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నిర్ణయాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మైక్రో అండ్ స్మాల్ / మీడియం ఎంటర్‌ప్రైజెస్ స్వాగతించింది. ఈ విధానం గతంలో రిటైల్ రుణాలపై ముందస్తు చెల్లింపు జరిమానాలను నిషేధించిన ఆర్‌బీఐ ఆదేశానికి అనుగుణంగా ఉంది. రుణ గ్రహీతల హక్కులను కాపాడడం, రుణ మార్కెట్‌లో ఆర్థిక చేరికను ప్రోత్సహించడం పట్ల ఆర్‌బీఐ తన నిబద్ధతను మరోసారి గుర్తు చేసింది. ఈ నిర్ణయం ఓఃూఇలకు మరింత సౌలభ్యం, ఆర్థిక స్వేచ్ఛను అందిస్తుందని, దీనివల్ల వ్యాపారులు తమ ఆర్థిక అవసరాలకు





అనుగుణంగా మెరుగైన రుణ ఆప్షన్లను ఎంచుకుంటారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆర్‌బీఐ తన నోటిఫికేషన్‌లో సూక్ష్మ, చిన్న వ్యాపారాలకు సౌకర్యవంతమైన రుణ సౌలభ్యం చాలా ముఖ్యమని పేర్కొంది. బ్యాంకులు, ఔఃఈఅలు అనుసరిస్తున్న పద్ధతులను తమ పర్యవేక్షణ సమీక్షల్లో గుర్తించినట్లు తెలిపింది. ప్రధానంగా ముందస్తు చెల్లింపు జరిమానాలు రుణగ్రహీతలకు అసౌకర్యాన్ని కలిగించడమే కాక, ఒప్పంద వివాదాలకు కూడా దారితీస్తున్నాయని వెల్లడించింది. కొన్ని బ్యాంకులు, ఔఃఈఅలు రుణ ఒప్పందాల్లో పరిమితి కలిగించే నిబంధనలు చేర్చి, రుణ గ్రహీతలకు తక్కువ వడ్డీ రేట్లు లేదా మెరుగైన సేవల కోసం ఇతర రుణదాతల వైపు మళ్లకుండా అడ్డుకుంటున్నాయని ఆర్‌బీఐ బుధవారం రాత్రి జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. ఇలాంటి పద్ధతులు రుణ గ్రహీతల ఎంపిక స్వేచ్ఛను, మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీని దెబ్బతీస్తాయని హెచ్చరించింది. ఈ ఆంక్షల నుంచి కొన్ని రకాల రుణదాతలకు మినహాయింపు ఇచ్చారు. స్మాల్ ÷నాన్స్ బ్యాంకులు, రీజినల్ రూరల్ బ్యాంకులు, టైర్3 ప్రైమరీ (అర్బన్) కో ఆపరేటివ్ బ్యాంకులు, రాష్ట్ర, కేంద్ర కో-ఆపరేటివ్ బ్యాంకులు, మిడిల్ లేయర్ ఔఃఈఅలు ఉన్నాయి. దీంతోపాటు ఇప్పటికే రూ.50 లక్షల వరకు రుణాలపై ముందస్తు చెల్లింపు జరిమానాలు విధించకుండా నిషేధించబడ్డాయి. క్యాష్ క్రెడిట్ లేదా ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాల విషయంలో రుణ గ్రహీత ఒప్పందంలో నిర్దేశిరచిన వ్యవధిలో సౌకర్యాన్ని పునరుద్ధరించ కూడదని బ్యాంకుకు ముందస్తు సమాచారం ఇస్తే, సౌకర్యం గడువు తేదీన రద్దు అయితే, ముందస్తు చెల్లింపు జరిమానాలు వర్తించవని నోటిఫికేషన్ స్పష్టం చేసింది.

# ఇవిఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయి

**2024 ఎన్నికలపై అనుమానాలు నివృత్తి చేయండి**

**వచ్చే ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించండి**

**ఇసిని కలిసి అనుమానాలు వెల్లడించిన వైకాపా నేతలు**



న్యూఢిల్లీ,**జులై 3 ఆంధ్ర ప్రగతి:** 2024 ఎన్నికల్లో ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, రానున్న ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘంను వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కోరారు. ఎన్నికల నిర్వహణపై ఈసీ పునరాలోచించాలన్నారు. సాయంత్రం 6 తర్వాత ఏపీలోని ఎన్నో నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగిందని, నాలుగు కోట్ల ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 7 తర్వాతే పోలయ్యాయన్నారు. సాయంత్రం 6 తర్వాత పెరిగిన ఓట్లపై ఈసీని విచారణ అడిగాం అని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఈవీఎంలపై అనుమానాలను వ్యక్తం చేస్తూ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డిలు ఈసీని కలిశారు. ఈసీ సమావేశం అనంతరం ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు ఉన్నాయి. రానున్న ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే నిర్వహించాలి. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణపై పునరాలోచించాలి. ఎన్నికల సంఘం పిలుపు మేరకు ఎన్నికల నిర్వహణ, ఈవీఎంలు, ఓటర్ లిస్టుల విషయంలో చర్చ జరిగింది. 2024 ఎన్నికలకు సంబంధించి అనుమానాల నివృత్తిపై సమావేశం నిర్వహించాం. 2024 ఎన్నికల్లో ఈవీఎంల తీరుపై అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలని కోరాం. ఈవీఎంలకు, వీవీప్యాట్‌లను కంపారిజన్ చేయమని అడిగాం. బ్యాటరీ చార్జింగ్ విషయంలో కూడా మా అనుమానాలను అడిగాం. పోలింగ్ మొదలైనప్పటి నుంచి చివరి వరకు బ్యాటరీ చార్జింగ్‌లో మార్పులను కూడా ప్రశ్నించాం. సాయంత్రం 6 తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. నాలుగు కోట్ల ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 7 తర్వాతే పోలయ్యాయి. సాయంత్రం 6 తర్వాత పెరిగిన ఓట్లపై విచారణ అడిగాం. వీవీప్యాట్‌ల విషయంలో కౌంటింగ్ చేయడానికి వీలులేదని ఎన్నికల సంఘం నిర్బంధంగా చెబుతోంది. బ్యాటరీ చార్జింగ్ విషయంలో రీఛార్జిబుల్ బ్యాటరీలు అని చెప్పారు. ఎక్కువ శాతం పెరిగిన ఓట్లపై పరిశీలిస్తామని ఎన్నికల అధికారులు చెప్పారని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ సంఖ్య గణనీయంగా పెరిగింది. రాయచోటి నియోజకవర్గంలో ఓట్ల సంఖ్య పెరిగింది. ఓటర్స్ డేటా తెప్పించి చూస్తామని చెప్పారు. బీహార్లో లాగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్.. ఆంధ్రప్రదేశ్‌లో చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఒప్పుకుంది. ఈవీఎంలపై టెక్నికల్ డౌట్స్ ఉన్నాయని ఆధారాలతో అడిగాం. హిందూపూర్‌లో పోలింగ్ బూతుల వివరాలతో సహా కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించాం. క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. ఓడిపోయామని ఈవీఎంలపై నేపం చూపెట్టట్లేదు. ప్రాక్టికల్‌గా మా వద్ద ఉన్న ఆధారాలను కేంద్ర ఎన్నికల సంఘం ముందు పెట్టాం. వైసీపీకి పార్లమెంట్లో 472 ఓట్లు వస్తే.. అసెంబ్లీలో ఒక ఓటు మాత్రమే వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్లో ఒక ఓటు వస్తే.. అసెంబ్లీకి 464 ఓట్లు వచ్చాయి. టీడీపీకి పార్లమెంట్లో 8 ఓట్లు వస్తే.. అసెంబ్లీకి 95 ఓట్లు వచ్చాయి. ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసు. పార్లమెంటుకు అసెంబ్లీకి ఓటింగ్ ప్యాట్రన్లో చాలా వ్యత్యాసం వచ్చింది. ప్రపంచంలో ఉన్న అభివృద్ధి దేశాల్లో యూస్, జర్మనీ, యూరప్ లాంటి దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు జరుగుతున్నాయి . భారతదేశంలో కూడా పునరాలోచించాలని వైవీ సుబ్బారెడ్డి చెప్పుకొచ్చారు.

# గోవిందరాజస్వామి ఆలయ సమీపంలో అగ్నిప్రమాదం

తిరుపతి**జులై 3 ఆంధ్ర ప్రగతి:** తిరుపతిలోని గోవిందరాజుస్వామి ఆలయం సమీపంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. గురువారం తెల్లవారుజామున గోవిందరాజు స్వామి ఆలయానికి సమీపంలో ఓ దుకాణంలో మంటలు చెలరేగడంతో భక్తులు పరుగులు తీశారు. దుకాణం నుంచి చలువ పందిళ్లకు మంటలు

అంటుకున్నాయి. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. షాపుల్లో ఇత్తడి సామాన్లు, బొమ్మలు దగ్ధంకావడంతో ఆస్తినష్టం జరిగినట్టు సమాచారం.

# గిల్ డబుల్ సెంచరీ

## బద్దలైన అనేక రికార్డులు 311 బంతుల్లో ద్విశతకం పూర్తి
## భారీ స్కోర్ దిశగా భారత్.. 6 వికెట్ల నష్టానికి 515 పరుగులు

ఇంగ్లాండ్ తో జరుగుతున్న రెండో టెస్టులో శుభమన్ గిల్ డబుల్ సెంచరీ చేశారు. ఎడ్జ్‌బాస్టన్‌లో తన మొదటి టెస్ట్ డబుల్ సెంచరీ సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను అనేక రికార్డులను నెలకొల్పాడు. శుభమన్ గిల్ 311 బంతుల్లో డబుల్ సెంచరీ పూర్తి చేశారు. 21 ఫోర్లు మరియు 2 సిక్సర్లతో ఈ స్కోరును సాధించాడు. సంయమనంతో కూడిన ఇన్నింగ్స్‌తో భారత స్కోరు పెంచుకుంటూ వెళ్లారు. గిల్ ఇంగ్లాండ్‌లో టెస్ట్ డబుల్ సెంచరీ సాధించిన మొదటి భారత కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు, ఇది ఒక అరుదైన రికార్డు. వరుసగా ఇంగ్లాండ్‌పై ధర్మశాల (2024), హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్ (2025)లో సెంచరీలు సాధించాడు. ఇది ఇంగ్లాండ్‌పై వరుసగా మూడు టెస్ట్‌లలో సెంచరీలు సాధించిన ఐదవ సందర్భంగా నమోదైంది. ఇంతకు ముందు మొహమ్మద్ అజహరుద్దీన్, దిలీప్ వెంగ్సర్కర్, రాహుల్ ద్రవిడ్ ఈ ఫీట్ సాధించారు. ఈ డబుల్ సెంచరీతో, గిల్ 25 ఏళ్లలోపు ఏడు టెస్ట్ సెంచరీలతో వీరేంద్ర సెహ్వాగ్ , రవి శాస్త్రీలతో పాటు రెండో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ (19 సెంచరీలు) అగ్రస్థానంలో ఉన్నారు. గిల్ తన కెప్టెన్సీలో మొదటి రెండు టెస్ట్ మ్యాచ్‌లలో (హెడింగ్లీ ,ఎడ్జ్‌బాస్టన్) సెంచరీలు సాధించాడు, విజయ్ హజారే (1951%-%52) , మొహమ్మద్ అజహరుద్దీన్ (1990) తర్వాత ఇంగ్లాండ్‌పై వరుస టెస్ట్ సెంచరీలు సాధించిన మూడవ భారత కెప్టెన్‌గా నిలిచారు. గిల్ ఎడ్జ్‌బాస్టన్‌లో టెస్ట్ సెంచరీ (డబుల్ సెంచరీ) సాధించిన రెండవ భారత కెప్టెన్‌గా నమోదయ్యాడు, ఇంతకు ముందు విరాట్ కోహ్లీ 2018లో ఈ ఫీట్ సాధించాడు. శుభమన్ గిల్ ఇప్పటికే వన్డేల్లో డబుల్ సెంచరీ చేశారు. 2023లో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో న్యూజీలాండ్‌పై జరిగిన మొదటి %హాణX% మ్యాచ్‌లో 208 పరుగులు (149 బంతులు, 19 ఫోర్లు, 9 సిక్సర్లు) చేశారు. పురుషుల %హాణX% క్రికెట్‌లో డబుల్ సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడిగా నిలిపింది. ఈ రికార్డు గతంలో ఇషాన్ కిషన్ (24 సంవత్సరాల 145 రోజులు, 2022లో బంగ్లాదేశ్‌పై 210) పేరిట ఉంది. పలు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. సెనా దేశాల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి ఆసియా కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. 2011లో లార్డ్స్ వేదికగా శ్రీలంక కెప్టెన్‌గా తిలకరత్న దిల్షాన్ 193 పరుగులు చేశాడు. ఇదే ఇప్పటి వరకు ఆసియా కెప్టెన్ అత్యధిక స్కోర్. ఇంగ్లండ్‌పై డబుల్ సెంచరీ సాధించిన తొలి భారత కెప్టెన్‌గానూ చరిత్రకెక్కాడు. ఇంగ్లండ్ గడ్డపై డబుల్ సెంచరీ బాదిన తొలి పర్యాటక జట్టు కెప్టెన్‌గా కూడా నిలిచాడు. భారత కెప్టెన్‌గా డబుల్ సెంచరీ బాదిన రెండో పిన్నవయస్కుడిగా కూడా గిల్ నిలిచాడు. గిల్ కన్నా ముందు మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ(23 ఏళ్ల 39 రోజుల వయసులో) ఈ ఫీట్ సాధించాడు. పటౌడీ ఇంగ్లండ్‌తో ఢిల్లీ వేదికగా 1964లో జరిగిన మ్యాచ్‌లో డబుల్ సెంచరీ సాధించాడు. సచిన్ టెండూల్కర్(26 ఏళ్ల 189 రోజుల), విరాట్ కోహ్లీ(27 ఏళ్ల 260 రోజులు) గిల్ తర్వాతి స్థానాల్లో నిలిచారు.



## పాకిస్థాన్ జట్టు భారత్‌కు రావొచ్చు

### భారత క్రీడా మంత్రిత్వ శాఖ వెల్లడి



2025 ఆసియా హాకీ టోర్నమెంట్‌కు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ టోర్నమెంట్‌లో ఆగస్టు 27న ప్రారంభమై సెప్టెంబర్ 7న ముగుస్తుంది. భారత్‌లోని బిహార్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. అయితే ఇటీవల భారత్- పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ హాకీ జట్టు ఇక్కడికి రావడంపై కొద్దిరోజులుగా సందిగ్ధత నెలకొంది. దీనిపై భారత క్రీడా మంత్రిత్వ శాఖ గురువారం కీలక అప్డేట్ ఇచ్చింది. ఈ టోర్నమెంట్‌లో పాకిస్థాన్ పాల్గొనడంపై భారత్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని తాజాగా పేర్కొంది. ఈ విషయంలో పాకిస్థాన్ హాకీ జట్టు భారత్‌కు రావడంపై షరతులు లేవని తెలిపింది. 'భారత్‌లో ఏ టోర్నమెంట్‌లోనైనా ఆడేందుకు ఏ జట్టుకు కూడా మేం వ్యతిరేకం కాదు. కానీ, ద్వైపాక్షిక సిరీస్‌ల్లో మాత్రం మా వైఖరి వేరుగా ఉంటుంది' అని క్రీడా మంత్రిత్వశాఖ అధికారి ఒకరు మీడియాతో చెప్పారు. కాగా ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన షెడ్యూల్ ఇంకా రిలీజ్ కావాల్సి ఉంది.

## చరిత్ర సృష్టించిన రవీంద్ర జడేజా




రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) చరిత్రలో 100 వికెట్లతో పాటు 2000 పరుగులు చేసిన ఏకైక ఆటగాడిగా రవీంద్ర జడేజా నిలిచాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో హాఫ్ సెంచరీ చేయడం ద్వారా జడేజా ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో జడేజా తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. 137 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 89 పరుగులు చేశాడు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి 6వ వికెట్‌కు 203 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. ఈ క్రమంలో డబ్ల్యూటీసీలో 2000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. 2021లో డబ్ల్యూటీసీ ప్రారంభమవ్వగా..ఇప్పటి వరకు 41 మ్యాచ్‌లు ఆడిన జడేజా 25.92 సగటుతో 132 వికెట్లు తీయడంతో పాటు 2000 ప్లస్ రన్స్ చేశాడు. మరే ఆటగాడు కూడా ఈ ఫీట్ సాధించలేదు. డబ్ల్యూటీసీలో జడేజా ఇప్పటి వరకు మూడు సెంచరీలు చేశాడు. బౌలింగ్‌లో ఆరు సార్లు 5-వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో సెంచరీ దిశగా సాగిన జడేజాను జోష్ టంగ్ షార్ట్ పిచ్ డెలివరీతో కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. 310/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్ లంచ్ బ్రేక్ సమయానికి 6 వికెట్లకు 419 పరుగులు చేసింది. క్రీజులో శుభ్‌మన్ గిల్(168 బ్యాటింగ్)తో పాటు వాషింగ్టన్ సుందర్(1 బ్యాటింగ్) ఉన్నారు. తొలి సెషన్‌లో భారత్ 25 ఓవర్లు ఆడి ఒకే ఒక్క వికెట్ కోల్పోయి 109 పరుగులు చేసింది.

........

## కార్ల్‌సన్‌కు గుకేష్ షాక్

జాగ్రెబ్ (క్రొయేషియా): వరల్డ్ చాంపియన్ గుకేష్..ప్రపంచ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు గట్టి షాకిచ్చాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జగ్రెబ్ అంచె సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో గురువారం జరిగిన ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌ను గుకేష్ చిత్తు చేశాడు. దాంతో టోర్నీలో ఆరు రౌండ్లు ముగిసేసరికి గుకేష్ మొత్తం పది పాయింట్లతో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు.






## లైవ్ మ్యాచ్‌లో పాము

శ్రీలంక క్రికెట్ జట్టు బుధవారం జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టును 77 పరుగుల తేడాతో ఓడించింది. ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మైదానంలోకి సుమారు 6 అడుగుల పొడవున్న పాము దూసుకురావడంతో కలకలం రేగింది. ఈ సమయంలో ఆటగాళ్లు మైదానంలో ఆడుతున్నారు. ఈ క్రమంలో పామును చూసి అందరూ ఆగిపోయారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.శ్రీలంక జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. పేలవమైన ఆరంభం తర్వాత కుశాల్ మెండిస్ (45) మంచి ఇన్నింగ్స్ ఆడగా.. కెప్టెన్ చరిత్ అసలంక అద్భుతమైన సెంచరీ సాధించాడు. అసలంక 106 పరుగుల ఇన్నింగ్స్‌లో 4 సిక్సర్లు, 6 ఫోర్లు కొట్టాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు 244 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ మూడో ఓవర్ సందర్భంగా ఈ పాము మైదానంలోకి ప్రవేశించింది. దీనిని కెమెరాలో బంధించారు. మైదానంలో పాకుతూ వస్తున్న ఈ పాము పిచ్ వైపు వేగంగా కదిలింది. దీంతో మ్యాచ్‌ను కొంతసేపు నిలిపివేయాల్సి వచ్చింది. ఇంతకు ముందు కూడా శ్రీలంకలో ఈ తరహా పాము మైదానంలోకి ప్రవేశించింది. కొన్ని రోజుల క్రితం ఒక మ్యాచ్ సందర్భంగా పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కూడా కెమెరాకు చిక్కాడు. 245 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్ జట్టుకు మంచి ఆరంభం లభించింది. తంజీద్ హసన్(62), నజ్ముల్ హుస్సేన్ శాంటో(23) నిలకడైన ఇన్నింగ్స్‌తో బంగ్లాదేశ్ ఒక వికెట్ నష్టానికి 100 పరుగులు చేసింది. కానీ నజ్ముల్ రనౌట్ అయిన తర్వాత మొత్తం జట్టు కుప్పకూలింది. 100 పరుగులకు కేవలం ఒక వికెట్ కోల్పోగా.. అది 125/9గా మారింది. చివరికి అలీ కొంతసేపు పోరాడి అర్ధ సెంచరీ(51) సాధించినా అది సరిపోలేదు. శ్రీలంక క్రికెట్ జట్టు మొదటి వన్డేను 77 పరుగుల తేడాతో గెలుచుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండో వన్డే శనివారం, జూలై 5న జరగనుంది. సిరీస్‌లో చివరి మ్యాచ్ జూలై 8న ఉంటుంది.



## క్వార్టర్స్‌లో శ్రీకాంత్

భారత షట్లర్ కిడాంబి శ్రీకాంత్ కాల్గెరీలో జరుగుతున్న కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 21-19, 21-12తో వాంగ్ పొ వీ (చైనీస్ తైపీ)ని ఓడించాడు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ‘ఆంధీ వచ్చేసింది’

## గూస్‌బంప్స్ తెప్పిస్తున్న ‘హరి హర వీరమల్లు’ ట్రైలర్..



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘హరి హర వీరమల్లు’ సినిమా ట్రైలర్ విడుదలైంది. మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన వీరమల్లు అనే యోధుడి పాత్రలో పవన్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. ట్రైలర్‌లోని భారీ యాక్షన్ సన్నివేశాలు, పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ చిత్రంలో సనాతన ధర్మాన్ని కాపాడే వీరుడిగా, కోహినూర్ వజ్రాన్ని దక్కించుకోవడానికి మొఘలులను ఢీకొట్టే వీరమల్లుగా పవర్‌స్టార్ కనిపించనున్నారు. క్రూరమైన మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్రలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ భయంకరంగా కనిపిస్తున్నారు. పవన్, బాబీల మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. ముఖ్యంగా “ఆంధీ వచ్చేసింది” అనే డైలాగ్ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. పవన్ రాజకీయ ప్రస్థానాన్ని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను ఈ డైలాగ్ గుర్తుచేస్తోంది. అలాగే “అందరూ నేను రావాలని దేవుడిని ప్రార్థిస్తారు.. కానీ మీరు మాత్రం నేను రాకూడదని కోరుకుంటున్నారు” అనే సంభాషణ కూడా ఆయన ప్రస్తుత ఇమేజ్‌కు సరిగ్గా సరిపోయిందనే చెప్పాలి.

క్రిష్, జ్యోతి కృష్ణ ఈ చారిత్రక కథను భారీ హంగులతో తెరకెక్కించారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అందించిన నేపథ్య సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. పవన్ సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఏ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా

# ఆకట్టుకుంటున్న ‘రామాయణ’ ఫస్ట్ గ్లింప్స్

రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి
దర్శకత్వం వహిస్తున్న నితీశ్ తివారీ
మూడు నిమిషాల నిడివితో వచ్చిన ప్రత్యేక వీడియో
సినిమాలోని కీలక పాత్రలను పరిచయం చేసిన చిత్రబృందం



భారతీయ సినీ పరిశ్రమలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘రామాయణ’ సినిమా నుంచి ఓ కీలక అప్డేట్ వచ్చింది. బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా, ప్రముఖ నటి సాయి పల్లవి సీతగా నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం నుంచి తాజాగా ఓ ప్రత్యేక గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. రామాయణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు మరింత ఊతమిస్తూ, సినిమాలోని ప్రధాన పాత్రలను పరిచయం చేసే ఉద్దేశంతో ఈ తొలి వీడియోను విడుదల చేశారు. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీత దేవిగా సాయి పల్లవి లుక్స్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక విలువలతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి. ఈ గ్లింప్స్ విడుదలతో సినిమా ప్రమోషన్లు అధికారికంగా మొదలైనట్టేనని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# మధ్యతరగతి కుటుంబం నేపథ్యంలో..

సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వినాద్రి, బేబీ నేహా శ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాతగా నవీన్ కుమార్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. బిగ్ బాస్ సీజన్ 7 ఫేమ్ గౌతం కృష్ణ హీరోగా రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి జుడా సంధ్య సంగీతాన్ని అందించారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ కు వివి వినాయక్ ముఖ్య అతిథిగా రఘు కుంచే, కేఎల్ దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివి వినాయక్ మాట్లాడుతూ “ఈ చిత్రంలో నటించిన గౌతమ్ కృష్ణకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా మంచి విజయం సాధించి సతీష్ ప్రయాణానికి తోడ్పడాలని కోరుకుంటున్నాను”అని అన్నారు. నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ “ఈ సినిమా గౌతం సినీ కెరీర్‌లో ఒక మంచి మైల్ స్టోన్ కావాలని కోరుకుంటున్నాను. ఈ సోలో బాయ్ చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చుతుంది”అని పేర్కొన్నారు. దర్శకుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ%ొ% “ఈ సినిమాలో గౌతమ్ కృష్ణ ఎంతో అద్భుతంగా నటించారు. అలాగే ఇద్దరు హీరోయిన్లు తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటారు” అని తెలిపారు. హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ “మధ్యతరగతి కుటుంబంలో ఉండే ఎన్నో విషయాలు ఈ సినిమాలో ఉండబోతున్నాయి. దర్శకుడు నవీన్ కుమార్ ఈ సినిమాను మంచి అవుట్‌పుట్‌తో రూపొందించాడు”అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్లు శ్వేత అవస్తి, రమ్య పసుపులేటి, అనిత చౌదరి, ఆట సందీప్, లిరిసిస్ట్ పూర్ణచారి పాల్గొన్నారు.

# అందరూ లీలగానే...అందుకే అవకాశాలు వదిలేసా!

కాంతార%-%తో వెలుగులోకి వచ్చిన కన్నడ బ్యూటీ సప్తమీగౌడ గురించి పరిచయం అవసరం లేదు. తొలి సినిమాలో నేచురల్ బ్యూటీతో అలరించింది. లంగావోణీ దుస్తుల్లో క్రేజీ బ్యూటీగా పాపులర్ అయింది. ‘కాంతార’ పాత్రలోనూ కాస్త బోల్డెనెస్ హైలైట్ అయింది. సహజంగా బోల్డ్ సన్నివేశాల్లో సౌత్ నటులు కనిపించడం చాలా అరుదు. సీన్ డిమాండ్ చేస్తే తప్ప అలాంటి ఛాన్స్ తీసుకోరు. ఆ రకంగా సప్తమీ గౌడ హైలైట్ అయింది. కాంతార హిట్ తర్వాత బాలీవుడ్..టాలీవుడ్ లో ఛాన్స్ లందు కుంది. ప్రస్తుతం తెలుగులో నితిన్ హీరోగా నటించిన తమ్ముడులో నటించింది. ఇదే అమ్మడికి తొలి తెలుగు సినిమా. ఈ సినిమా సహా బాలీవుడ్ లో థామా%లో నటిస్తోంది. ఇవిగాక కన్నడ సహా ఇతర పరిశ్రమాలో చాలా అవకాశాలు వదులుకున్నట్లు సప్తమీగౌడ రివీల్ చేసింది. కాంతార సక్సెస్ తర్వాత చాలా సినిమాల్లో హీరోయిన్ పాత్రలు వచ్చాయంది. కానీ అవన్నీ కూడా కాంతార తరహా పాత్రలనే పోలి ఉన్నాయని..ఆ కారణంగానే వదులుకున్నట్లు తెలిపింది. ఒకసారి చేసిన పాత్రను మళ్లీ చేయడం వలన ఉపయోగం ఏంటి? మహా అయితే పారితోషికం అందుకుంటాం. అంతకు మించి ఆ సినిమా ద్వారా తనకు వచ్చే గుర్తింపు అంటూ ఏదీ ఉండదని అభిప్రాయపడింది. సరిగ్గా అదే సమయంలో తమ్ముడు కథ తన వద్దకు రావడం..పాత్ర డిఫరెంట్ గా ఉండటంతో వెంటనే అంగీకరించినట్లు తెలిపింది. పాత్రకు సరిపోతానా? లేదా? అని లుక్ టెస్ట్ నిర్వహించి ఎంపిక చేసారు. నన్ను తప్ప మరో నటిని వాళ్లు కూడా చూడలేదు. ఈ పాత్ర కోసం గుర్రపు స్వారి నేర్చుకోవాలన్నారు. మొదట కాస్త భయమేసినా ధైర్యంగా నేర్చుకున్నానునని తెలిపింది. అలాగే %-%పుష్ప%-% సినిమలో రష్మికా మందన్నా పోషించిన శ్రీవల్లి లాంటి పాత్ర పోషించాలని ఉందంది. విభిన్నమైన పాత్రలు చేయడానికి ఏమాత్రం వెనకడుగు వేయనని తెలిపింది.



# హాలివుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026కి ఎంపికైన దీపిక పదుకొణె

ప్రముఖ నటి దీపికా పదుకొణెకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ఆమె హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026కు ఎంపికయ్యారు. ఈ మేరకు హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. మోషన్ పిక్చర్స్ విభాగంలో ఆమె ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. ఈ గౌరవం దక్కించుకున్న తొలి భారతీయ నటి దీపిక కావడం విశేషం. హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విడుదల చేసిన జాబితాలో డెమి మూర్, రాచెల్ మెక్ ఆడమ్స్, ఎమిలీ బ్లంట్ వంటి హాలీవుడ్ తారలతో పాటు దీపిక పేరు కూడా ఉండటంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026కు 35 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసినట్లు ఛాంబర్ ప్రకటించింది. కాగా, దీపికా పదుకొణె 2006లో సినీ పరిశ్రమలోకి ప్రవేశించగా, 2017లో రిటర్న్ ఆఫ్ గ్జాండర్ కేజ్‌తో హాలీవుడ్ తెరపై మెరిశారు. ప్రస్తుతం అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కలయికలో రానున్న బహుభాషా చిత్రంలో దీపిక నటిస్తున్నారు. దీని తర్వాత కల్కి 2898 ఏడీ సీక్వెల్‌లోనూ నటించనున్నారు.

